క్లుప్తంగా

సీహెచ్‌సీ తనిఖీ



ఆస్పత్రి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు

పాతపట్నం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని జిల్లా వైద్య సమన్వయాధికారి జె.భాస్కరరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న సేవలతోపాటు, ఆస్పత్రిలో సౌకర్యాలు, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. అల్ట్రా స్కానింగ్‌ను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలన్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సూపరింటెండెంట్ వై.సురేంద్రబాబు, వైద్యులు జి.అనిత, శిమ్మన్నాయుడు, సందీప్ బరోడా, హెచ్.సునీత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

సరుబుజ్జిలి: కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, సీఈఓ రామారావు బుధవారం ప్రకటనలో వెల్లడించారు. 2022–23 పంట కాలానికి రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 20లోగా రెన్యువల్ చేసుకొంటే 4 శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుందన్నారు. గడువు దాటితే 13 శాతం వడ్డీని రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, ఇతర సౌకర్యాలు పొందే వెసులుబాటు ఉండదన్నారు.

తులసీదాస్‌కు సన్మానం



తులసీదాస్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సారవకోట: మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమించిన నక్క తులసీదాస్‌కు బుడితి సచివాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. పార్టీ నాయకులు నిక్కు రాజశేఖర్, మెండ రామకృష్ణ, జాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

పాతపట్నం: మండలంలోని తామర గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల శాంతారావు అన్నారు. బుధవారం తామర గ్రామంలో సీసీ రోడ్డుకు ఎంపీటీసీ పడాల విజయకుమారి శంకుస్థాపన నిర్వహించారు. ధర్మాన వీధి నుంచి తామర శివాలయం వరకు రోడ్డు నిర్మాణం చేపడతున్నామన్నారు. శిమ్మ రామారావు, ఎం.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న జయశ్రీ

నరసన్నపేట: క్షయ రోగులు పోషకాహారం తీసుకోవాలని నరసన్నపేట వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నరసన్నపేట ఆస్పత్రి పరిధిలో ఉన్న క్షయ రోగులకు పోషకాహార కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఉచితంగా మందులు సరఫరా చేస్తుందన్నారు. ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు విశేషస్పందన



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సరుబుజ్జిలి: భారత రాజ్యాంగ పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని రొట్టవలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో భారత రాజ్యాంగం–ప్రాథమిక హక్కులు అన్న అంశంపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పరిరక్షణ వేదిక అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటర్లే పునాది

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటు హక్కుపై అవగాహన కల్పించిన అధికారులు

ప్రజాస్వామ్యానికి ఓటర్లే పునాది అని నరసన్నపేట ఆర్డీఓ, డిప్యూటీ కలెక్టర్ జయదేవి, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, పలువురు అధికారులు అన్నారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని రెవెన్యూ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు ప్రధాన్యతను విద్యార్థులు, ప్రజలకు తెలియజేశారు. గ్రామాల్లో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: ఓటు హక్కుపై మానవహారం నిర్వహిస్తున్న అధికారులు



పాతపట్నం: స్థానిక కోర్టు కూడలి వద్ద ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్



నరసన్నపేట: కొత్త ఓటర్లకు ఓటు కార్డులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ జయదేవి



సరుబుజ్జిలి: మండల కేంద్రంలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఆమదాలవలస రూరల్: ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



జలుమూరు: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



బూర్జ: ప్రశంసాపత్రం అందుకుంటున్న పాలవలస బీఎల్ఓ హితేంద్ర



హిరమండలం: మండల కేంద్రంలో ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



బూర్జ: మార్కెట్ కూడలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పలు శాఖల సిబ్బంది



ఎల్.ఎన్.పేట: వెంకటేశ్వరమ్మకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్



ఎల్.ఎన్.పేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు విద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



పోలాకి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: సంక్షేమ పథకాలను వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పోలాకి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం గాతలవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు మేలు జరుగుతుంటే టీడీపీకి చెందినవారికి మాత్రం కడుపు మండుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా పారదర్శకమైన, వేగవంతమైన సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, అధికారులు, నాయకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, మాజీ ఎంపీపీ దుంపల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు చింతు సింహాచలం, రెంటికోట త్రినాథరావు, చింతాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

పాతపట్నం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పాతపట్నం మండల కేంద్రంలోని దువ్వారివీధిలో బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు పంపిణీపై ఆరా తీశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని, గడపగడపకు వెళ్లినప్పుడు వారి ఆనందాన్ని తెలయజేస్తున్నారన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ప్రదీప్, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



స్పీకర్‌ను కలిసిన సింధువాడ గ్రామస్తులు

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం సింధువాడ గ్రామానికి చెందిన 18 కుటుంబాలకు చెందినవారు బుధవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆమదాలవలస పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద వారందరికీ స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో సింధువాడ సర్పంచ్ గోవిందు కామేశ్వరి, వైస్ ఎంపీపీ శివానందబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, ఆలోచనల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సీఎం జగన్ పరిపాలన నచ్చి పార్టీలో చేరినట్లు వారంతా చెప్పారు. సరుబుజ్జిలి మండలం నాయకులు, కార్యకర్తలు, పొందూరు ఎంపీపీ వండన వెంకటరావు, పార్టీ నాయకుడు సూరపునాయుడు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ పట్ల నిబద్ధతతో సైనికుల్లా పనిచేయాలని గ్రామ సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. స్థానిక బ్రహ్మణవీధి కూడలిలో కేఎస్ఎం ప్లాజాలో నియోజకవర్గ స్థాయి గ్రామ సచివాలయ కన్వీనర్లతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లే పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. వలంటీర్ పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ దొర సావిత్రి, పాతపట్నం, కొత్తూరు, ఎల్,ఎన్.పేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరావు, సూర్యనారాయణ, కృష్ణ, మెళియాపుట్టి జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పార్టీ నాయకుడు బైపోతు ఉదయ్, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, రెడ్డి రామారావు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలని వినతి



కొత్తూరు: వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కొత్తూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల యూనియన్ నాయకులు రజని, ధనలక్ష్మితోపాటు పలువురు ప్రభుత్వాన్ని కోరారు. పలు సమస్యలుతోపాటు డిమాండ్ పరిష్కరించాలని కొత్తూరు ఐసీడీఎస్ కార్యాలయం అధికారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: అంగన్‌వాడీల న్యాయపరమైన కోర్కెలు తీర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి ప్రభుత్వాన్ని కోరారు. ఆమదాలవలస ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట బుధవారం కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం అధ్యక్షురాలు పంచాది లతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

గుండెపోటులో వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలి మృతి



విజయలక్ష్మి(ఫైల్)

ఆమదాలవలస: వైఎస్సీర్‌సీపీ ఆమదాలవలస పట్టణం మహిళా అధ్యక్షురాలు బొడ్డేపల్లి విజయలక్ష్మి (54) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ ప్రారంభం నుంచి పార్టీలో ఉంటూ పలు సేవలు అందించారు. ఆమె మృతి పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రగతి పత్రాలు పంపిణీ చేయాలి



ప్రగతి పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలకు సంబంధించిన ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు పంపిణీ చేయాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. తుంగతంపర, గొట్ట ప్రాథమిక పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రగతి పత్రాలు పంపిణీ చేశారు. సీఆర్పీ ధనుంజయరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పొందూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పొందూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పొందూరు: డీసీసీబీ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొందూరు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ వి.ప్రసూన కుమారి అన్నారు. పొందూరు డీసీసీబీ ఆవరణలో మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. బ్రాంచ్ పరిధిలో సుమారు రూ.1.06 కోట్లు ఆర్థిక లావాదేవీలను నిర్వహిస్తున్నామని, రూ.15 కోట్లు గోల్డ్ లోన్లు అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గురుగుబెల్లి శ్యామలరావు జగనన్న తోడు పథకంపై మహిళలకు అవగాహన కల్పించారు. సీసీలు సత్యనారాయణ, సూర్యప్రభ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

కొత్తూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు దళిత సంఘం నాయకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కామక త్రినాథరావు బుధవారం తెలిపారు. దళిత సంఘం నేతలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం కొత్తూరు మండలం జగనన్న సచివాలయం కన్వీనర్లను ఎమ్మెల్యే సత్కరిస్తారన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పనులు వేగవంతం



నూతన తహసీల్దార్ కార్యాలయం

మెళియాపుట్టి: మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం పాత కార్యాలయంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గుత్తేదారులకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో.. కార్యాలయం వినియోగానికి నోచుకోలేదు. ఇటీవల ఎంపీపీ రాజా ఈశ్వరమ్మ చొరవతో పెండింగ్ పనులకు సంబంధించి కొంత మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. దీంతో పెండింగ్ పనులు జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లోనే కార్యాలయం వినియోగానికి వస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



మెరిట్ స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న దాతలు

సరుబుజ్జిలి: కొండవలస గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను బుధవారం అందించారు. తరాతరణి పట్నాయక్ జయంతి సందర్భంగా ఆయన కుమారులు త్రినాథరావు, వెంకటరమణ, నాగభూషణం, నరేష్ పాఠశాలకు చెందిన 20 విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కింద మొత్తం రూ.10 వేలు అందజేశారు. స్థానిక సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం మునగవలస శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

103 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీలో హిరమండలం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహించారు. 103 మందికి డాక్టర్ మణికంఠ, ఫరూక్ హుస్సేన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు స్కానింగ్‌లు, ఈసీజీలు తీశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. క్యాంప్ డీఈఓ ధర్మాన కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్ల పట్టివేత

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఒడిశా నుంచి 12 బీరులతో ఓ వ్యక్తిని పట్టుకున్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై నమోదు చేశామని ఎస్ఈబీ ఎస్ఐ(మొబైల్ టీమ్) కె.కల్యాణి తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఆకృతి



సారవకోట మండలంలోని జేబీటీ పాఠశాల విద్యార్థులు గురువారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని బుధవారం 74 ఆకారంలో కూర్చున్నారు. కూర్చున్న విద్యార్థుల చుట్టూ కొంత మంది విద్యార్థులు జాతీయ జెండా పట్టుకుని నిల్చున్నారు.

– సారవకోట